సాక్షి రంగారెడ్డి

శనివారం । 13 । మే । 2023



పగలు రెక్కీ.. రాత్రి చోరీ

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 10లో▸



రాష్ట్రంలో ఉద్యోగ భద్రత కరువు

సీఎం కేసీఆర్ పాలనలో ఉద్యోగ భద్రత కరువైందని జీసీ సంఘం దక్షిణ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్ అన్నారు. 10లో▸

ఓయూ హాస్టల్స్, మెస్‌ల మూసివేత

ఉస్మానియా యూనివర్సిటీ: వేసవి సెలవుల కారణంగా ఆదివారం నుంచి యూనివర్సిటీ క్యాంపస్‌లోని వివిధ పీజీ హాస్టళ్లు, మెస్సులను మూసివేయనున్నట్లు చీఫ్ వార్డెన్ ప్రొ.శ్రీనివాస్ రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి వచ్చే నెల 5న పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు గమనించి..సహకరించాలని కోరారు.

న్యూస్‌రీల్

కార్మికుల హక్కులపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర

హయత్‌నగర్: అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ హక్కులను సాధించుకునేందుకు న్యాయవ్యవస్థ దోహదపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర అన్నారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని కుంట్లూర్ వార్డు కార్యాలయం వద్ద శుక్రవారం ఆమె అసంఘటిత కార్మికుల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికులకు చట్టం ఎన్నో హక్కులను కల్పిస్తోందన్నారు. వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని, న్యాయ సంబంధమైన సమస్యలను న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి కార్మికుడు తప్పనిసరి గుర్తింపు కార్డులు, బీమా కార్డులను పొందాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామ్మోహన్, బాల్‌రెడ్డి, పారా లీగల్ వలంటీర్లు మాడ్గుల అనురాధ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన హెడ్‌ఫోన్స్

- రైలు ఢీకొని టెన్త్ విద్యార్థిని దుర్మరణం
- మొబైల్‌లో పాటలు వింటూ ట్రాక్ వెంబడి నడుస్తుండగా ఘటన

నాంపల్లి: వేసవి సెలవుల్లో బంధువుల ఇంటికి వచ్చి..తిరిగి ఆనందంతో సొంతూరికి బయలుదేరిన ఓ టెన్త్ విద్యార్థిని రైలుకింద పడి మృత్యువాత పడింది. చెవిలో మొబైల్ హెడ్‌ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటూ రైల్వే ట్రాక్ వెంట నడుచుకుంటూ వెళ్తుండగా ఈ విషాదకర సంఘటన నాంపల్లి జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్ -బోరబండ రైల్వే స్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీదర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ చోటూమియా కుమార్తె మున్నీ బేగం (16) వేసవి సెలవుల్లో కె.ఎస్.నగర్ ప్రాంతంలో నివసించే అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఇటీవల విడుదలైన పద తరగతి పరీక్షల్లో కూడా మున్నీ బేగం పాసైంది. పదిహేను రోజుల క్రితం నగరానికి వచ్చిన ఆమె గురువారం రాత్రి 7.30 గంటలకు సొంతూరుకు తిరుగు పయనమైంది. బీదర్ నుంచి లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుని అక్కడి నుంచి ఎంఎంటీఎస్ రైలులో బోరబండ రైల్వే స్టేషన్‌లో దిగింది. చెవిలో హెడ్‌ఫోన్ పెట్టుకుని పాటలు వింటూ పట్టాల వెంట వెళ్తుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. హెడ్‌ఫోన్లు పెట్టుకొని నడవడం వల్ల రైలు శబ్దం వినపడలేదని, అందువల్లే ప్రమాదం జరిగిందని తెలిసింది. దీనిపై స్థానికులు అందించిన సమాచారంతో జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, శవాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్‌ఫోన్లు చాలా ప్రమాదకరం

మొబైల్ హెడ్‌ఫోన్లు వాడుతూ రైలు పట్టాల వెంబడి నడవటం, రైలు పట్టాలను దాటడం, ఫోన్లో మాట్లాడుతూ, రైలు ఎక్కడం, దిగడం, డోర్ దగ్గర నిలబడి ప్రయాణించడం ప్రమాదకరమని నాంపల్లి జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. ప్రయాణికులు చేసే చిన్నపాటి నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫోన్లు వాడటం మూలంగా రైళ్ల రాకపోకల శబ్దాలు వినపడవని, తద్వారా ప్రమాదం జరిగే ఆస్కారం ఉందన్నారు.

జిల్లా సిగలో దిగ్గజ కంపెనీ



భూమిపూజకు సిద్ధంగా చదును

కొంగరకలాన్‌లో కొలువుదీరనున్న 'ఫాక్స్‌కాన్'

- 196 ఎకరాలు.. రూ.3,500 కోట్ల పెట్టుబడి
- 15న భూమిపూజకు టీఎస్‌ఐఐసీ ఏర్పాట్లు
- నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లా సిగలో మరో ప్రతిష్టాత్మక కంపెనీ చేరనుంది. తైవాన్ కేంద్రంగా పనిచేసే ఫాక్స్‌కాన్ కంపెనీ ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌లో 196 ఎకరాల విస్తీర్ణంలో, రూ.3,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానుంది. ఈ నెల 15న ఉదయం 10.30 గంటలకు కంపెనీ చైర్మన్ యంగ్ లీ, మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భూమిపూజ నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ పారి శ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (టీఎస్‌ఐఐసీ) అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. అంతర్జాతీయ దిగ్గజ కంపెనీ కొంగరలో ఏర్పాటు కానుండడంతో ఈ ప్రాంతంలో పరిశ్రమల విస్తరణకు మరింత అవకాశం కలుగనుంది.

కంపెనీ నేపథ్యం ఇదే..

ఫాక్స్‌కాన్ ప్రపంచంలోనే అతిపెద్ద టెక్నాలజీ తయారీదారు ప్లస్ సర్వీస్ ప్రొవైడర్. ప్రసిద్ధ అమెరికన్, చైనీస్, కెనడా జపనీస్ కంపెనీలకు ఎలక్ట్రానిక్స్ వస్తువులను తయారు చేస్తోంది. ఫాక్స్‌కాన్ తయారు చేసిన ప్రసిద్ధ ఉత్పత్తుల్లో యాపిల్‌కి చెందిన ఐఫోన్, ఐపాడ్, అమేజాన్ కిండిల్ ముఖ్యమైనవి. సోనీకి ప్లేస్టేషన్, నోకియాకు అనేక మొబైల్ పరికరాలు అందజేసే ఫాక్స్‌కాన్ గతంలో బ్లాక్‌బెర్రీ ఫోన్ కూడా తయారు చేసింది. ఫాక్స్‌కాన్ కస్టమర్లలో మైక్రోసాఫ్ట్, అమేజాన్, హెచ్‌పీ, ఐబీఎం, డెల్ లాంటి ప్రపంచ ఐటీ దిగ్గజ కంపెనీలు కూడా ఉన్నాయి. యాపిల్ కంపెనీ ఫాక్స్‌కాన్‌కి అతిపెద్ద కస్టమర్. ఐఫోన్లు, ఐపాడ్‌లు, మాక్‌బుక్స్ ద్వారానే ఫాక్స్‌కాన్ 50 శాతం ఆదాయం ఆర్జిస్తోంది. కరోనా తర్వాత దేశంలోనే ఎలక్ట్రానిక్ చిప్‌ల తయారీకి భారత ప్రభుత్వం ముందుకురావడంతో మైనింగ్ దిగ్గజం వేదాంతతో కలిసి 20 బిలియన్ డాలర్లతో దేశంలో మొదటి చిప్ మేకింగ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసింది. కొంగరకలాన్‌లో ఏర్పాటు చేసే పరిశ్రమలో మాత్రం ఈయర్‌పాడ్స్‌ను తయారు చేయనున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి.

తూర్పు ప్రాంతానికి మహర్దశ

ఇప్పటివరకు హైదరాబాద్‌కు పశ్చిమ ప్రాంతానికే పరిమితమైన ఐటీ, అనుబంధ కంపెనీలు తాజాగా తూర్పు (మహేశ్వరం, ఇబ్రహీంపట్నం)ప్రాంతంపై కూడా దృష్టి సారించాయి. ఇప్పటికే అమేజాన్ డేటా సెంటర్ సహా, టీసీఎస్, టాటా ఏరోస్పేస్ వంటి కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. తాజాగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన 'హాన్ హై ఫాక్స్ కాన్' కంపెనీ రాకతో స్థానికంగా ఉన్న వేలాది మంది నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా..పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ అంతర్జాతీయ కంపెనీ రాకతో తూర్పు ప్రాంతానికి మహర్దశ రానుంది. మరో రెండు రోజుల్లో ఇక్కడ భూమి పూజ నిర్వహించనున్న నేపథ్యంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇప్పటికే భూమిని మొత్తం చదును చేసింది. అతిథులు ఆసీనులయ్యేందుకు భారీ వేదికను ఏర్పాటు చేస్తోంది.



చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

చిరుత కలకలం

- బ్రాహ్మణపల్లి శివారులో సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్
- వీడియోలో ఉన్న ప్రాంతాన్ని పరిశీలించిన అటవీ శాఖ అధికారులు



సంచరిస్తున్న చిరుతపులి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లి శివారు హిమసాయి ఫేజ్-3, ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో చిరుత కలకలం రేపింది. చిరుత సంచరిస్తున్న వీడియో ఆలస్యంగా బయటికి రావడంతోపాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో శుక్రవారం అటవీ శాఖ అధికారుల బృందం వీడియోలో ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఎనిమల్ ట్రాకింగ్ ఏర్పాటు చేసి ఆనవాళ్లు కనుక్కుంటామని పేర్కొన్నారు. వీడియోలో చెట్ల ఆకులు ఎండిపోయినట్లుగా కనిపిస్తుండగా ప్రస్తుతం ఇటీవల కురిసిన అకాల వర్షాలతో మొత్తం పచ్చగా ఉన్నాయి. దీని బట్టి ఈ వీడియో సుమారు 20 రోజుల క్రితంనాటిది అయి ఉంటుందని భావిస్తున్నారు. పచ్చని చెట్లతో ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో చాలామంది వాకింగ్ చేస్తుంటారు. అలా వాకింగ్ చేస్తున్న వ్యక్తులు తీసిన వీడియో అయి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ విషయంపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ వీడియోలో కనిపిస్తున్నది చిరుత లేదా హైనా అయి ఉండొచ్చని, ఆధారాలు దొరికాక పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. రైతులు, వాకింగ్‌కు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

- మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీనివాస్

మహేశ్వరం: ఇండస్ట్రియల్ ఏరియాలోని ప్రతి కంపెనీ అగ్నిమాపక సాధనాలను ఎప్పటికీ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మహేశ్వరం జోన్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మంఖాల్ ఇండస్ట్రియల్ జోన్ తుమ్మలూరు ప్లాస్టిక్ పార్కులోని చిర్‌పాల్ కంపెనీలో శుక్రవారం అగ్ని ప్రమాదాలు- భద్రత చర్యలపై కంపెనీల యాజమాన్యాలు, మేనేజర్స్, అగ్నిమాపక అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంపెనీల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కంపెనీలో ఉన్న విద్యుత్ ఉపకరణాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు సులభంగా మండే పదార్థాలను దూరంగా ఉంచాలన్నారు. కంపెనీల్లో ఉపయోగించే రసాయనాలను ఒక దగ్గర కాకుండా వేర్వేరుగా నిల్వ చేయాలన్నారు. వెల్డింగ్, కటింగ్, సోల్డరింగ్ పనులు చేసేటప్పుడు అనుమతులు తీసు కోవాలన్నారు. కంపెనీలో ఎమర్జెన్సీ ఎగ్జిట్ సిబ్బంది అందరికీ తెలిసి ఉండాలన్నారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎంత త్వరగా ఆర్పాలో సిబ్బందికి కనీస అవగాహన కల్పించాలని సూచించారు. ఎలక్ట్రిక్ ఫైర్ జరిగినప్పుడు ప్రథమంగా మెయిన్ స్విచ్ఛాఫ్ చేసిన తరువాత మంటలను ఆర్పడానికి ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏసీపీ అంజయ్య, రాజేంద్రనగర్ డివిజన్ అగ్నిమాపక అధికారి పూర్ణచందర్, సీఐ మధుసూదన్, మహేశ్వరం అగ్నిమాపక అధికారి రమేష్, ఎస్‌ఐ రవీందర్, పలు కంపెనీల మేనేజర్లు పాల్గొన్నారు.

చేయి చేయి కలిపారు.. చెరువు రక్షణకు కదిలారు



కలెక్టరేట్ వద్ద అఖిలపక్ష నాయకులు

- కబ్జా కోరల్లో మాసబ్ చెరువు
- తరచూ మట్టిని డంప్ చేస్తున్న రియల్ వ్యాపారులు
- కాపాడుకునేందుకు ఒక్కటైన అఖిలపక్షం
- 'సేవ్ మాసబ్ చెరువు' పేరిట వాట్సాప్ గ్రూపు
- వరుస ఆందోళనలు

తుర్కయంజాల్: జెండాలు, అజెండాలు, రాజకీయ పార్టీలను పక్కన పెట్టి అంతా ఒక్కటయ్యారు. చేయిచేయి కలిపారు.. మాసబ్ చెరువు పరిరక్షణకు మేము సైతం అంటూ కదిలారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఒక్కరు పిలుపునిస్తే చాలు అంతా ఐక్యతను చాటుతున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు చేతులెత్తేసినా కన్న తల్లి లాంటి చెరువును కాపాడుకుంటామని ప్రతినబూనారు. ఎట్టిపరిస్థితుల్లోనూ చెరువు అన్యాక్రాంతం కానిచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు.

సాక్షి వెలుగులోకి తేవడంతో..

చెరువులో నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో వందల కొద్ది టిప్పర్ల మట్టిని డంప్ చేస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ క్రమంలో మార్చి 6న 'సాక్షి'లో 'మాసబ్ చెరువుపై రియల్ కన్ను' శీర్షికన కథనం ప్రచురించింది. వరుసగా కథనాలు రావడం, బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టడంతో అప్రమత్తమైన అధికారులు ఒక్కరోజు డంప్ చేసిన మట్టిని తొలగించి ఆ తరువాత చేతులు దులుపుకొన్నారు. తిరిగి ఇటీవలి కాలంలో యథావిధిగా మట్టిని డంప్ చేస్తుండడంతో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, స్థానికంగా నివాసం ఉంటున్న వారంతా ఒక్కటయ్యారు.

వాట్సాప్ పిలుపుతో..

సేవ్ మాసబ్ చెరువు అంటూ వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కరు పిలుపునిస్తే చాలు అంతా ఒక్కటై చెరువు పరిరక్షణకు ముందుకు వస్తున్నారు. ఈ నెల 9న అఖిలపక్షం ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు కలిసి ధర్నా నిర్వహించారు. ఆ తరువాత రాత్రి వేళ పెద్ద ఎత్తున డంప్ చేస్తున్నారనే సమాచారంతో ఈ నెల 10న, 11వ తేదీల్లో అర్ధరాత్రి దాటే వరకు పదుల సంఖ్యలో చెరువు వద్దే ఉండి నిరసన వ్యక్తం చేశారు. 11న మున్సిపల్ కమిషనర్‌ను కలిసి మట్టి డంప్ చేసిన ప్రాంతంలో చేపడుతున్న నిర్మాణాలను తొలగించాలని ఫిర్యాదు చేశారు. 12న మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అధ్యక్షతన అఖిలపక్ష నాయకులు అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో రెండు నెలల నుంచి మట్టిని డంప్ చేస్తున్న పట్టించుకోవడం లేదని, వెంటనే చెరువును రీ సర్వే చేసి హద్దులను నిర్ణయించాలని వినతిపత్రం సమర్పించారు.

చేయని ప్రయత్నమే లేదు..

జిల్లాలోని అతి పెద్ద చెరువుల్లో ఒకటైన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు 343.06 ఎకరాల ప్రభుత్వ భూమి, 152-38 ఎకరాల పట్టా భూములను ఎఫ్‌టీఎల్ (పూర్తి స్థాయి నీటి మట్టం) కలిగి ఉంది. రికార్డుల ప్రకారం 9-30 ఎకరాల ప్రభుత్వ భూమి, 22-05 ఎకరాల పట్టా భూములతో బఫర్‌జోన్‌గా ఉంది. నిజాం కాలంలో తవ్విన ఈ చెరువు కొన్నేళ్ల క్రితం వరకు ఉమ్మడి హయత్‌నగర్ మండలంలో సాగు నీటి అవసరాలను తీర్చింది. 2020 నుంచి ఏటా పుష్కలంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువు నిండు కుండలా మారింది. ఇది జీర్ణించుకోలేని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాసబ్ చెరువుపై కన్నేసి నీటిని ఖాళీ చేయడానికి చేయని ప్రయత్నం లేదు. ఎన్నోసార్లు తూమును ధ్వంసం చేసి నీటిని బయటకు పంపించడానికి ప్రయత్నం చేసినా విఫలమవుతూ వస్తున్నారు.



సన్‌రైజర్స్, లక్నో మ్యాచ్‌కు వేళాయె..

మరో ఐపీఎల్ సమరానికి భాగ్యనగరం సిద్ధమైంది. ఉప్పల్ స్టేడియంలో శనివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో లక్నో ఆటగాళ్లు ప్రాక్టీస్ చేశారు.

– సాక్షి, హైదరాబాద్

ఆరు నెలల్లో అధికారంలోకి వస్తాం

- రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం
- రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రూ.500కే గ్యాస్
- దళిత, గిరిజనులకు మూడు ఎకరాల భూమి పంపిణీ చేస్తాం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



షాబాద్‌లో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

షాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని సీఎల్పీ నేత భట్టివిక్రమార్క పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఏఐసీసీ సెక్రటరీ, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, టీపీసీసీ వర్కింగ్ మాజీ అధ్యక్షుడు కుసుమకుమార్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. వచ్చే ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రూ.500కే గ్యాస్, దళిత, గిరిజనులకు 3 ఎకరాల భూమి, ధరణి పోర్టల్ తొలగిస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలో రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ప్రస్తుతం రూ.1,200 పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేవెళ్ల నియోజకవర్గం నుంచే పాదయాత్ర మొదలు పెట్టారని, సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను ఇక్కడి నుంచే ప్రారంభించారని గుర్తు చేశారు. షాబాద్‌లో ప్రభుత్వ ఆస్పత్రి లేకపోవడం బీఆర్‌ఎస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం అన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి ప్రాధాన్యతగా ఇక్కడ ప్రభుత్వ ఆస్పత్రి నిర్మిస్తామన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ పార్టీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యావంతులు, మేధావులను భాగస్వాములను చేయాలన్నారు. అంతకు ముందు ప్రజా గాయకుడు గద్దర్ తన పాటలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, పార్టీ మాజీ అధికార ప్రతినిధి పామెన భీంభరత్, సీనియర్ నాయకులు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్, పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, చేవెళ్ల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, జిల్లా నాయకులు భార్గవ్‌రామ్, మహిళా అధ్యక్షురాలు అశ్విని, ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు సుబ్రహ్మణ్యేశ్వరి, ప్రతాప్‌రెడ్డి, రవీందర్, ఆంజనేయులు, చేవెళ్ల స్వామి, శేఖర్, ఖుద్దూస్, అక్తర్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

బడంగ్‌పేట్: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఓపెన్ క్రికెట్ పోటీలకు ఎంపికై నట్లు ఆ పాఠశాల హెచ్ఎం అర్జున్ తెలిపారు. ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పట్టణంలో జరిగిన పోటీల్లో బడంగ్‌పేట పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారని అన్నారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీ


చోరీలకు పాల్పడిన నిందితులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- ముఠాగా ఏర్పడిన రంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాలకు చెందిన వ్యక్తులు
- నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- 30తులాల బంగారు, కిలో వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్ రూరల్: తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్.. పగలు రెక్కీ.. రాత్రి ఆ ఇంటికి కన్నం వేస్తారు.. ఈ ముఠా పట్టణంలో వరుస చోరీలకు పాల్పడుతూ అందిన కాడికి దోచుకెళుతోంది. నిఘా పెట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలం దేవునిఎర్రవల్లికి చెందిన ఎం రాఘవేందర్‌రెడ్డి అలియాస్ రాజు, అలియాస్ రఘు, వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం, పోచమ్మగుట్ట తండాకు చెందిన మోతీరాం, వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం, రేమద్దుల గ్రామానికి చెందిన చందు ఓ ముఠాగా ఏర్పడ్డారు. షాద్‌నగర్ పట్టణంలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. ఏప్రిల్ 18న పట్టణంలోని విజయనగర్ కాలనీకి చెందిన నరేష్‌కుమార్ ఇంటికి తాళం వేసి నైట్ డ్యూటీకి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం తిరిగి రాగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి 20 తులాల బంగారు, 13 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సీసీఎస్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ పర్యవేక్షణలో షాద్‌నగర్ పోలీసులు, శంషాబాద్ సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాఘవేందర్‌రెడ్డి, మోతీరాం, చందును అదుపులోకి తీసుకొని విచారించగా చోరీల విషయం ఒప్పుకున్నారు. ఏడాది నుంచి షాద్‌నగర్ పరిధిలో 08, చేవెళ్లలో 03, మొయినాబాద్‌లో 02, మైలార్‌దేవ్‌పల్లి 01, వనపర్తి జిల్లా పాన్‌గల్‌లోని ఓ ఇంట్లో దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. నిందితుడు రాఘవేందర్‌రెడ్డి వేర్వేరు పోలీస్‌స్టేషన్లలో 59 దొంగతనం కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు కేసులకు సంబంధించి 20తులాల బంగారు నగలు, 50 తులాల వెండి ఆభరణాలు, ఇతర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలకు సంబంధించి 10తులాల బంగారు, 50 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో పట్టణ సీఐ నవీన్‌కుమార్, డీఐ భరత్‌కుమార్, శంషాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వీరబాబుతో పాటు సిబ్బంది ఎంతో చాకచక్యంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, సీసీఎస్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ వారిని అభినందించారు.

సెల్లార్ గుంతలో పడి వ్యక్తి మృతి

రసూల్‌పురా: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి సెల్లార్ గుంతలో పడి మృతి చెందిన సంఘటన తిరుమలగిరి పీఎస్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ శ్రవణ్ తెలిపిన మేరకు.. పీఎస్ పరిధిలోని శాస్త్రీనగర్ పిట్టల బస్తికి చెందిన రూబి ప్రకాష్ (47) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. డైరీఫాం రోడ్ లోని గన్‌రాక్ రిలయన్స్ మార్ట్ పక్కన ఉన్న సెల్లార్ గుంతలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. విచారణలో శాస్త్రీనగర్‌కు చెందిన వ్యక్తిగా తేలిందని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్రంలో ఉద్యోగ భద్రత కరువు

బీసీ సంఘం దక్షిణ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్


సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న అశోక్‌గౌడ్

షాద్‌నగర్ రూరల్: సీఎం కేసీఆర్ పాలనలో ఉద్యోగ భద్రత కరువైందని బీసీ సంఘం దక్షిణ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం అశోక్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జేపీఎస్, ఓపీఎస్‌లు చేపట్టిన సమ్మెకు శుక్రవారం ఆయన మద్దతు ప్రకటించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9వేల మంది జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టారని అన్నారు. వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నేతలు రాములు గౌడ్, మేడిగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

పంచాయతీ జూనియర్, ఔట్ సోర్సింగ్ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కే భూపాలాచారి, జిల్లా అధికార ప్రతినిధి కే వెంకటేష్ గుప్తా డిమాండ్ చేశారు. జేపీఎస్, ఓపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ జూనియర్ కార్యదర్శులు సమ్మె బాట పట్టడంతో పాలన పడకేసిందన్నారు. వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మనోహర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేష్, రఘు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి పేరుతో స్వాహా

ఇద్దరి నుంచి రూ. 30లక్షలు లూటీ

హిమాయత్‌నగర్: పెట్టుబడి పేరుతో సైబర్ నేరగాళ్లు ఇద్దరి నుంచి భారీ మొత్తంలో కాజేశారు. పెట్టుబడి పెడితే కోట్లు వస్తాయంటూ నమ్మిన ఆ ఇద్దరూ అందినకాడికి పంపుతూనే మోసపోయారు. లాభాలు ఇవ్వకపోగా పెట్టుబడి పెట్టిన డబ్బును తీసుకోవాలంటే టాస్కులు చేయాలంటూ మాయ మాటలు చెప్పారు. ఇలా లక్షలు రూపాయిలు మోసపోయిన తర్వాత శుక్రవారం సిటీ సైబర్‌క్రైం పోలీసుల్ని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. నగరానికి చెందిన మహిళకు ఓ వ్యక్తి టెలిగ్రామ్ ద్వారా పరిచమయ్యాడు. పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో చక్కగా సంపాదించొచ్చంటూ మాట కలిపాడు. ఈ మాటలు నమ్మిన మహిళ పెట్టుబడి పెట్టడం ప్రారంభించింది. తొలిరోజుల్లో లాభాలు ఇచ్చి ఆశ ఎరవేశారు. ఆ తర్వాత రూ.10లక్షలు దోచుకున్నారు. మరో వ్యక్తిని ఇదే విధంగా ట్రాప్ చేసి అతగాడి నుంచి రూ.20లక్షలు స్వాహా చేశారు. దీంతో ఈ ఇద్దరి వేర్వేరు ఫిర్యాదులతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ తెలిపారు.

కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నెర్రపల్లిలో రూ. 40 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ చంద్రయ్య, ఎంపీపీ కృపేశ్, వైఎస్ ఎంపీపీ ఎం ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ భాస్కర్ గౌడ్, బ్యాంకు డైరెక్టర్ శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్ రెడ్డి, ప్రసాద్, శేఖర్ పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో పూజలు

యాచారం: చౌదర్‌పల్లి హరిహర క్షేత్రంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి, గణపతి, నంది, ధ్వజస్తంభ, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తిభావం పెరిగినప్పుడే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ రాష్ట్ర నేత మల్లేష్, బీజేపీ నేత ఆచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఏ మాస్టర్ పీస్’ పోస్టర్ ఆవిష్కరణ

నందిగామలో సందడి చేసిన చిత్ర యూనిట్ సభ్యులు


సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మనీష్ గిలాడ, యూనిట్ సభ్యులు

నందిగామ: శుక్ర మూవీ ఫేమ్ అరవింద్ కృష్ణ నటించిన ఏ మాస్టర్ పీస్ చిత్రం యూనిట్ సభ్యులు శుక్రవారం నందిగామలోని ఓ పరిశ్రమలో సందడి చేశారు. పరిశ్రమ ఆవరణలో చిత్ర యూనిట్ సభ్యులు, ప్రతి నాయకుడు మనీష్ గిలాడ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మనీష్ గిలాడ మాట్లాడుతూ.. బండి బ్యానర్‌పై రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి సుకు పూర్వజ్ కథ రచయితగా, దర్శకుడిగా వ్యవహరించారని తెలిపారు. కథానాయికలుగా బిగ్ బాస్ ఫేమ్ అషురెడ్డి, సినీ నటి స్నేహ గుప్తా, జ్యోతిరాయ్‌లు నటిస్తున్నారని చెప్పారు. హాలీవుడ్ రేంజ్‌లో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 90 శాతం షూటింగ్ పూర్తయిందని, పోస్టు ప్రొడక్షన్ వర్క్ నడుస్తోందని తెలిపారు. ఆరు భాషల్లో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబరులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

చేవెళ్ల: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ హయ్యూమ్ తెలిపిన వివరాలు.. చేవెళ్లకు చెందిన టీ వెంకటప్ప(45) గ్రామ పరిధిలోని షాబాద్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా షాబాద్ వైపు నుంచి చేవెళ్లకు వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ కారు వదిలి పారిపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య పక్కిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నీరజ్ కుందన్‌కు ఘన స్వాగతం


నీరజ్‌కుందన్‌ను సత్కరిస్తున్న ఫరీద్

ఆమనగల్లు: ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు నీరజ్ కుందన్‌కు ఆమనగల్లు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో శుక్రవారం నీరజ్ కుందన్‌కు ఆమనగల్లు మండల అధ్యక్షుడు ఫరీద్, తలకొండపల్లి అధ్యక్షుడు రమేశ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రాజు స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బీ వెంకట్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


శ్రీకాంత్(ఫైల్)

కడ్తాల్: నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హరిశంకర్ గౌడ్ తెలిపిన వివరాలు.. కడ్తాల్‌కు చెందిన వీ శ్రీకాంత్(50) ఈ నెల 9న హైదరాబాద్‌కు బయలుదేరాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. ఆచూకీ లభించలేదు. శ్రీకాంత్ భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అమ్మ లేని జీవితం వద్దు

బంజారాహిల్స్: అల్లారుముద్దుగా పెంచి విద్యాబుద్ధులు నేర్పిన అమ్మ మరణాన్ని తట్టుకోలేక డిప్రెషన్‌లోకి వెళ్లిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నేదులూరు మండలం ముక్కేశ్వరం గ్రామానికి చెందిన బీ హరికృష్ణ(22) ఐటీఐ పూర్తి చేసి గత నాలుగు సంవత్సరాలుగా ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. స్నేహితుడితో కలిసి శ్రీకృష్ణానగర్‌లో అద్దెకుంటున్నాడు. 2021లో హరికృష్ణ తల్లి సత్యవాణి గుండెపోటుతో మృతి చెందింది. అప్పటి నుంచే తల్లిలేని జీవితం వృథా అంటూ హరికృష్ణ డిప్రెషన్‌లోకి వెళ్లాడు. తల్లి జ్ఞాపకాలతోనే గడిపేవాడు. పనికి కూడా వెళ్లేవాడు కాదు. ఈ నేపథ్యంలోనే స్నేహితుడు వెంకటేశ్వర్‌రావు డ్యూటీకి వెళ్లిన కొద్దిసేపటికే శుక్రవారం తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తల్లి మరణాన్ని తట్టుకోలేక తన కుమారుడు హరికృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి అర్జున్‌రావు తెలిపాడు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.